# తమసః పరస్తాత్

*** రచన: రామకృష్ణశాస్త్రి

అంతకుముందే సీతకూ నాకూ బ్రహ్మాండమైన పోట్లాట అయింది... నేను ఆమె యెడల నొనరించిన అపరాధంబుల జాబితా ఏకరవు పెట్టడానికి పావుగంట పట్టింది. లక్ష వత్తుల వ్రతం ప్రాయశ్చిత్త కాండంలో నన్నా లేవు, అన్ని పాపాలు: నిదానంగా అన్నింటికీ ఒడిపట్టి, అయిపోయిందనిపించుకుని... ఇక ఎన్నటికీ, ఈ జన్మలో నామొగం చూడ ననిపించుకుని... పొమ్మనిపించుకుని... ఏ పాపమూ ఎరుగని అర్భకుడి లాగా, యింటికి తిరిగివస్తూ... ఆ పక్కకు మళ్లాను...

—ఎవరో ధొరలు విస్కీలో వాలలాడుతున్నారు... ఆ వాసనకు, సీత కళ్లలో కైపు మనసుకు గుప్ మన్నది... అదిగో, ఆ మూల ఎవరో ఆగామి దంపతుల సమక్షంలో జిన్ సీసా విడిపడ్డది... సీత సిగలో మల్లెల దొంతర గుమ్ మన్నది...

త్రాగని నిషా, భరించలేకపోయినాను, దోషదంగా రవంత హాలాహాలం, విశేషం కల్తీలేకుండా, ఒక్క గుక్కన్నరలో హతమార్చి యింటికివచ్చి ఉన్న మాటలన్నీ నొక్కి... ఆ వెలుతురు వంక ఉరిమిచూస్తూ... త్రివిక్రమంగా నిషా విజృంభింప చేసుకుంటున్నాను...

—ఆ తరుణంలో... సరిగా... వచ్చింది జానకి... ఉప్పెన వచ్చినట్టు... ఏటిపాయ కొట్టుకు వచ్చినట్టు లోపలికివచ్చి పడ్డది... ఉరిమింది... కుర్చీలు గంద్రగోళంగా జరిపింది... రేడియోలో కాబూలీ సంగీతం త్రిప్పింది.

'ఆ శ్రుతిలో గదసారించి ఒక్క సీసపద్యం సెలవియ్యి' అని పలుకరించింది నాలో నిషా.


చక్కని రచనలకు

ఆనందవాణి

సాలు చందా

10 రూపాయలు


ఆ తిట్లన్నీ కర్ణపేయంగా ఉన్నవి. సీతకు అన్ని బూతులు రావు. ఆమెలో యింత శబ్దశక్తి యిమిడ లేదు.

'ఎన్ని అన్నా' అలా బెల్లంకొట్టిన రాయిలాగా మాట్లాడ వేం?.

'పటిక—బెల్లమందూ, యింతలో నీ యిల్లు బంగారమైపోదు'.

'పోదూ ఎన్నన్నా సిగ్గులేకపోతే.

'కులసతి సిగ్గరి కావలె, నేను యిల్లాలినీ కాను, ఎట్సెటెరా... ఇతి మధురవాణీ...

—జానకి కళ్లలో కాటుకపిట్టలు గగ్గోలు పడినవి. అణగిమణగి పడిఉండలేని పెదవి, భూకంపంగా అదిరింది.

నాకు నవ్వు వచ్చింది. కత్తులూ కారాలూ—మిరియాలూ నూరి-నూరి చివరికి కన్నీళ్లలోకి తేలిపోయే ఆడతనంమీద నాకు ఎంత అసహ్యమో జానకికి తెలియదన్నా!

గుండెలు తరుక్కుపోయేట్టు వచ్చింది జానకి. మొగరాయడంత అదిరిపాటుతో రోషంగా అక్కడనుంచి పారిపోయింది.

ఆడ—లేడి రెండు మాటలూ మనసులో ద్వంద్వయుద్ధానికి తలపడుతున్నాయి. లేడి కళ్లలో అనవసరపు చాలి.

గడియారం, గర-గరలాడింది ఖంగ్న ఒక్కసారి మ్రోగింది. ఆ మ్రోతకు అర్థంలేదు అది పన్నెండున్నరా?

అలుమారలోనుంచి, ఆల్బమ్‌ను బయటికి రమ్మని బ్రతిమాలాను. అందులో ఆడపిల్లలందరూ మడిగట్టుకు, ఎన్నాళ్ళనుంచో అట్టలచాటున అణగీ—మణగీ పడిఉన్నారు. ఈ అర్ధరాత్రివేళ, వాళ్ళందరినీ ఒక్కసారి తిరగవేసి మతులు చెరచడం, మంచిదనా? పక్కలో పసిపిల్లలు కెవ్ మంటారేమో?

దీపాలన్నీ కొండెక్కినవి. కొండమీద వెండి గిన్నెలో పాయసం కొంచెం, మాలోగిలి మీదికి వొలికింది.

సీతతో పోట్లాడి గెలిపించి వచ్చాను. జానకి తనంతట ఓడిపోయినట్టు, పారిపోయింది.

—వైదేహి దబదబా తలుపుమీద బాదుతూంది ఆ చేతి చురుకు అంటే ఆకాశానికికూడా వాడలు. రవంత వెన్నెల మరకా చెరిగిపోయింది. ఎక్కడో ఉరుములు పిలచుకుంటూ తలుపు గడ-గడలాడుతూంది. నా చేతులు వెళ్ళి గడియ తీసినవి.

వైదేహి నిలుచున్నంతమేరా చీకటిమీద, చూచాయగా డాగుపడుతూంది. కళ్లు కరవొస్తున్నాయి...నన్ను అమాంతం కబళించి వేస్తుందనుకున్నాను ఆ తామసం.

పాపం నేనేదో అపరాధం చేశానుకనా అని దండించేందుకు వచ్చింది, పసిపిల్ల.

—పసిపిల్ల అవును, ఆడది ముత్తవతల్లి అయిన తరువాతనైనా, ఆగడం, మారామూ చిలిపితనం, మొండిపట్టు బావురుమనటం, మానలేదు. ఎల్లకాలమూ ఉయ్యాలలోపాపే...మనకుమాత్రం అంత అదృష్టం లేదు.

వైదేహి, హుంకరించుతూంది నేను కాలువ ముసుకు చాటునుంచి కేకవేశాను.

'ఏమిటా మారాము? ఇలా వచ్చి పడుకో, చిచ్చికొడుతాను పిచ్చిపిల్లా'

—బల్లమీద పుస్తకాలు రెండు ఎగిరివచ్చి నామీద పడ్డాయి గోడమీది గడియారం అద్దం పచ్చు-పచ్చైంది.

'యింతీ మంచముపైనిదె కంతుడు కూర్చున్నవాడు...'

—కంతుడి చెంప ఛెళ్-మన్నది ఒళ్లు ఝుల్-మన్నది పరాకున.

—ఉన్న దిళ్లన్నీ దొంతరచేసి, తలక్రిందకు లాక్కుంది, వైదేహి...ఒత్తిగిలపోతే అక్కడ తల మోపేందుకు చోటులేదు.

## ఒంటినై

కవితయై నిలచింది
ఆమె నాముందు
భావ వెల్లువ
　　　నాలో
బ్రద్దలయ్యింది
కావ్యానికై నేను
　　　కలము పట్టాను
కవనమే నేనంచు
　　　వీపు తట్టింది.

( ( (

వెలుగుతో నిలచింది
ఆమె నాముందు
పిచ్చి ఊహాలు
　　　నాలో
పొర్లి పోయాయి
కళ్ళు పెద్దవిచేసి
　　　కాంచబోయాను
మిరుమిట్లుచే కళ్లు
　　　మూసుకున్నాను.

( ( (

గొంతెత్తి పాడింది
ఆమె నాముందు
కూని రాగము
　　　నాలో
బయలుదేరింది
గొంతు గొంతూ కలిపి
　　　పాడబోయాను
జంట విడి ఒంటినై
　　　మిగిలిపోయాను

—సచ్చిదానంద శర్మ.